

'అనంత' కమిషనర్‌గా రామలింగేశ్వర్‌కు పూర్తి బాధ్యతలు

దీర్ఘకాలిక సెలవుపై నాగరాజు

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా అదనపు కమిషనర్ రామలింగేశ్వర్‌కు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ హరినారాయణ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు ప్రస్తుత కమిషనర్ నాగరాజు 16వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 13వ తేదీ వరకు రెండు నెలల పాటు సెలవు కోరుతూ దరఖాస్తు చేసుకోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా అదనపు కమిషనర్‌కు ఎఫ్ఎసి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో ప్రస్తుతం కమిషనర్‌గా నియమితులైన రామలింగేశ్వర్ ఏ మేరకు బాధ్యతలు నిర్వహిస్తారో వేచి చూడాల్సుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

సామాజిక స్థితిగతుల మార్పునకు కులగణన అవసరం

మాజీ రాష్ట్రపతి కెఆర్.నారాయణన్ ఓఎస్డీ ఎస్ఎన్. సాహు

ముగిసిన మానవహక్కుల వేదిక రాష్ట్ర మహాసభలు



పుస్తకాన్ని విడుదల చేస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో మార్పు జరగాలంటే కులగణన అవశ్యమని మాజీ రాష్ట్రపతి కెఆర్.నారాయణన్ ఓఎస్డీగా పనిచేసిన ఎస్ఎన్.సాహు పేర్కొన్నారు. అనంతపురం నగరంలో రెండు రోజులుగా జరుగుతున్న మానవ హక్కుల వేదిక 10వ రాష్ట్ర మహాసభ ఆదివారం ముగిసింది. అనంతపురం నగరంలోని యాపిల్ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ మహాసభలో రెండో రోజు మూడు అంశాలపై సదస్సు జరిగింది. అంతకు ముందు నంబూద్రిపాద్ రాసిన పుస్తకాన్ని విడుదల చేశారు. అనంతరం 'కుల గణన ఎందుకు అవసరం' అన్న అంశంపై సాహు ప్రసంగించారు. దేశంలో ఇప్పటికీ వివక్ష పూరిత సమాజం ఉందని చెప్పారు.మాజీ రాష్ట్రపతి కెఆర్.నారాయణన్ వంటి వారు కూడా ఈ వివక్షను ఎదుర్కొన్న వారేనని అన్నారు. ఈ కులవివక్ష రూపాలను సరిగా అర్థం చేసుకోవాలంటే కులగణన జరగాల్సిన అవసరముందని ఆయన నొక్కిచెప్పారు. దేశంలో పశు గణన కూడా నడుస్తోందికాని, కులగణన మాత్రం జరగడం లేదని అన్నారు. మొట్టమొదటిసారి కేరళలో ముఖ్యమంత్రిగా నంబూద్రిపాద్ బాధ్యతలు చేపట్టాక అక్కడ చేయించారని గుర్తు చేశారు. వివక్ష అన్నది ఒక్క హిందూమతంలోనే కాదని, ఇతర మతాల్లోనూ వివక్ష ఉందన్నది ఆ సర్వేలో స్పష్టమైందన్నారు. అంబేద్కర్ వ్యాఖ్యానిచ్చినట్టు దేశంలోనున్న నిచ్చెన్నమెట్ల వ్యవస్థలో ఎంతపైకిపోయే కొద్దీ అంత వివక్ష తగ్గుతుందని, ఎంత దిగువకొచ్చేసరికి అంత పెరుగుతుందని స్పష్టం చేశారు. కులగణన ద్వారా సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. 'బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన' అంశంపై స్వతంత్ర జర్నలిస్టు మాలిని సుబ్రమణ్యం మాట్లాడారు. బస్తరులో మానవ హక్కుల ఉల్లంఘన యధేచ్ఛగా సాగుతోందని విచారం వ్యక్తం చేశారు. బడా కార్పొరేట్ కంపెనీలకు అక్కడి అడవుల్లోనున్న విలువైన ఖనిజాన్ని కట్టబెట్టేందుకు ఆదివాసాలను వెళ్లగొట్టే ప్రయత్నం పథకం ప్రకారం నడుస్తోందని అన్నారు. ఈ క్రమంలో తీవ్రవాద ముద్ర వేసి అమాయక ఆదివాసీలపై భద్రతా బలగాల ద్వారా హింసకు పాల్పడుతున్నారని తెలిపారు. మందుపాతర పెట్టారన్న నేపథ్యంలో ఒక గ్రామంలో 127 మంది ఆదివాస అమాయకులను ఎన్ఐఎ అరెస్టు చేసి ఐదేళ్లు జైళ్లో పెట్టిందని చెప్పారు. ఆ తరువాత వారంతా నిర్దోషులుగా బయటపడ్డారన్నారు. అయితే అప్పటిలోపు ఆ కుటుంబాలు చిన్నాభిన్నమైపోయాయని విచారం వ్యక్తం చేశారు. గత నెల నవంబరులో 47 మంది అమాయ గిరిజన మహిళలను ఎటువంటి కారణం లేకుండా వారం రోజులపాటు భద్రతా బలగాలు నిర్బంధంలో ఉంచాయని చెప్పారు. ఇక్కడి విషయాలు బయటకు పొక్కకుండా మీడియాను నియంత్రించే ప్రయత్నాలు సాగుతున్నాయని వివరించారు. నూతన విద్యా విధానంపై రచయిత కొప్పర్తి వెంకట రమణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం ప్రయివేటీకరణను ప్రోత్సహించేదిగా ఉందని చెప్పారు. అదే విధంగా పాఠ్యాంశాలను మార్చి కాషాయికరణ చేసే చర్యలు అందులో ఉన్నాయన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మానవహక్కుల వేదిక ఎపి రాష్ట్ర అధ్యక్షుడిగా కెవి.జగన్నాథరావు, ప్రధాన కార్యదర్శిగా వై.రాజేష్, ఉపాధ్యక్షులుగా యుజి.శ్రీనివాసులు, ఎ.రవి, జి.శివనాగేశ్వరరావు, ఎస్.అబ్దుల్ రసూల్, ఎం.శరత్, కార్యదర్శులుగా యుఎం.దేవేంద్రబాబు, బిఎన్.సుబ్బన్న, జి.రోహిత్‌ను ఎన్నుకున్నారు. అలాగే తెలంగాణ కమిటీ అధ్యక్షులుగా భుజంగరావు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ తిరుపతి, రెండు రాష్ట్రాల సమన్వయకర్తలుగా ఎస్.జీవన్‌కుమార్, వసంతలక్ష్మి, ఎ.చంద్రశేఖర్, విఎస్.కృష్ణను ఎన్నుకున్నారు.



సాబ్జి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

మాజీ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతి తీరనిలోటు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్సీ కామ్రేడ్ షేక్ సాబ్జి మృతి తీరనిలోటు అని యుటిఎఫ్ నాయకులు అన్నారు. సాబ్జి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ షేక్ సాబ్జి 1989లో ఉపాధ్యాయుడిగా ఎంపికైన నాటి నుంచి 2021 మార్చిలో ఎమ్మెల్సీగా ఎన్నికై ఉపాధ్యాయుల సమస్యలపై తనవంతు బాధ్యతగా పోరాటం కొనసాగించారని గుర్తు చేశారు. గతేడాది డిసెంబర్ 15న ఉద్యమంలో భాగంగా అంగన్వాడీ వర్కర్ల సమ్మెకు మద్దతు తెలియజేసి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. గౌరవాధ్యక్షులు ఎస్వి రమణయ్య, అధ్యక్షులు గోవిందరాజులు మాట్లాడుతూ సాబ్జికి అనంతపురం జిల్లాతో చక్కటి అనుబంధం ఉందన్నారు. రాష్ట్ర సంఘం నిర్ణయం మేరకు ఐదేళ్ల సర్వీస్ ఉన్నప్పటికీ వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని 2021 మార్చిలో జరిగిన ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీచేసి ప్రథమ ఓటుతోనే ఘన విజయం సాధించారన్నారు. శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీగా తన వంతు బాధ్యతగా అనేక ఉపాధ్యాయుల, ఉద్యోగ, కార్మికుల సమస్యలపై గళం విప్పారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగేంద్ర, ఆడిట్ కమిటీ సభ్యులు గంగాధర్, బుక్కరాయసముద్రం ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధవీరులకు సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం

విజయ్ దివస్ ముగిసి 53ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో 1965 యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులను ఆదివారం నగరంలోని హెచ్చెల్సీ కాలనీలో ఉన్న వికె భవన్‌లో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు మాట్లాడుతూ సైనికుల పట్ల తనకు ఎంతో గౌరవం ఉందన్నారు. ఇందులో భాగంగానే తాను తహశీల్దార్‌గా ఉన్న సమయంలో సైన్యంలో చేరటానికి ఎంతోమందికి శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లో చేరేలా కృషి చేసినట్లు వివరించారు. అంతేగాకుండా యుద్ధవీరులకు సన్మానం చేయడం తనకు లభించిన ప్రత్యేక గౌరవం అన్నారు. మాజీ సైనికుల సంఘం గౌరవ అధ్యక్షులు వికె.రంగారెడ్డి మాట్లాడుతూ పొరుగు దేశాల నుంచి మనదేశంలోని చొరబడేందుకు ప్రయత్నిస్తున్న శత్రువులతో పోరాడి దేశాన్ని కాపాడతున్న సైనికుల సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో 1965 పెద్దవీరులు సార్జెంట్ మల్లికార్జునరెడ్డి, సార్జెంట్ పి.గోవింద్‌రెడ్డి, హవల్దార్ ఎం.నర్సింహులు, హవల్దార్ పి.సిద్ధన్న, నీలిరత్నం, సిపాయి ఖాజామొహిద్దిన్, టి.శ్రీనివాసులు, మొహిద్దిన్, బాబారత్నం, వీరనారులు సి.నాగలక్ష్మి, విజయమ్మ, మాజీ సైనికసంఘం ప్రధాన కార్యదర్శి కెప్టెన్ పట్నం ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి, పలువురు మాజీ సైనికులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన మాజీ సైనికులు

రోడ్డుకు అడ్డంగా పశువులు

పట్టించుకోని పాలకులు - ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలో పశువుల సమస్య తీవ్రంగా మారింది. నిత్యం రోడ్లపై పదుల సంఖ్యలో పశువులు, గాడిదలు సంచరిస్తున్నప్పటికీ వాహనాలు ప్రయాణికుల రాకపోకులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. తమ పశువులను ఇళ్లలో ఉంచుకోవాలని మున్సిపల్ అధికారులు పలుమార్లు ప్రకటనలు, నోటీసులు జారీ చేసినప్పటికీ వాటి యజమానులు పట్టించుకోలేదు. కొన్నిసార్లు వాహనాలకు అడ్డుగా వచ్చి పశువులు దెబ్బతిన్నప్పటికీ గోరక్షక దళం వాటికి చికిత్స చేయించింది. కానీ వాటి యజమానులు పట్టించుకున్న పాపానపోలేదు. ఇటీవల రోడ్డుపై సంచరిస్తున్న కొన్ని పశువులను మున్సిపల్ అధికారులు శ్మశానం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలోకి తరలించినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. మెయిన్ బజార్, తేరుబజార్, లక్ష్మీబజార్, కణేకల్ రోడ్డు, తహశీల్దార్ రోడ్డు నేతాజీ రోడ్డు, ఓబులాచారి రోడ్డు, బళ్లారి రోడ్డు మొదలైన ప్రాంతాల్లో పశువులు, గాడిదలు పదుల సంఖ్యలో రోడ్డుకు అడ్డంగా ఉంటున్నాయి. కూరగాయల మార్కెట్ వద్ద కూరగాయలు, ఆకుకూరల వ్యర్థ పదార్థాలు రోడ్డుపై పడేయడం వల్ల వాటిని తినేందుకు వచ్చిన పశువులు రోడ్డుపైనే ఉంటున్నాయి. పశువులు రోడ్లపై ఉండటం వల్ల తరచూ పాదచారులు, వాహనదారులకు ప్రమాదాలకు గురవుతున్నారు. పట్టణంలో వందలాది కుక్కలు పెద్ద సంఖ్యలో రోడ్లపై తిరుగుతూ ప్రజలు, వాహన చోదకులను భయపెడుతున్నాయి. పలుచోట పిల్లలు, విద్యార్థులను కుక్కలు కొరికిన ఘటనలు అనేకంగా ఉన్నాయి. పట్టణంలో పందుల బెడద కూడా అధికంగా ఉంది. వాటికి కోతులు కూడా జతకావడంతో అవి గుంపులు గుంపులుగా తిరుగుతూ ఇళ్ల వద్ద ఆహార పదార్థాలు, ఇళ్లలోని వస్తువులను ఎత్తుకెళు తున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి పశువులు, గాడిదలు, పందుల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే కోతులను పట్టుకుని పట్టణానికి దూరంగా తరలించాలని కోరుతున్నారు.



రోడ్డుకు అడ్డంగా నిలబడిన పశువులతో ఇబ్బంది పడుతున్న వాహనదారుడు



రాయదుర్గంలో రోడ్డుకు అడ్డంగా నిలబడిన పశువులు

వాల్మీకి గంగాధర్ సేవలు మరువలేనివి

జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

వాల్మీకి చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు వాల్మీకి గంగాధర్ మృతి తీరనిలోటు అని జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఆదివారం నగరంలోని రామ్‌నగర్‌లో ఉన్న వాల్మీకి కళ్యాణ మండపంలో వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం, జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గంగాధర్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా గంగాధర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాల్మీకి గంగాధర్ న్యాయవాద వృత్తితోపాటు వాల్మీకి జాతి అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారన్నారు. కులమతాలకు అతీతంగా అందరితో సోదర భావంతో మెలిగేవారన్నారు. ముఖ్యంగా తనను సొంత సోదరిణిలా ఆప్యాయంగా పలకరించేవారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విప్ కాలవ శ్రీనివాసులు, విశ్రాంత డిఎఫ్ఒ ఆదినారాయణ, పెద్ద ఎత్తున వాల్మీకులు పాల్గొన్నారు.



గంగాధర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

నార్పల గురుకుల పాఠశాలకు

రోడ్డు వేయరా..?

మట్టిరోడ్డుతో విద్యార్థుల ఇబ్బందులు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు మెయిన్ రోడ్డు నుంచి పాఠశాల వరకూ ఉన్న లింకు రోడ్డు చిన్నపాటి వర్షం కురిసినా బురదమయంగా మారింది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డు మొత్తం బురదగా మారి వెళ్లేందుకు ఇబ్బందిగా మారుతోంది. రోడ్డు సమస్యను ఇప్పటికే పలుమార్లు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని పాఠశాల ప్రిన్సిపాల్ సంగీతకుమారి, ఛైర్మన్ రవికుమార్ తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గురుకుల పాఠశాలకు లింకు రోడ్డు వేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



బురదమయమైన నార్పల గురుకుల పాఠశాలకు వెళ్లే మట్టిరోడ్డు (పాతచిత్రం)

'ఆరోగ్యశ్రీ'తో మెరుగైన వైద్యం



డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ ఎం. శ్రీదేవి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ పథకం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, ఈ కార్డు ఉన్న కుటుంబంలో అనారోగ్యానికి గురైన వారు మెరుగైన వైద్య సేవలు పొందవచ్చని ఆరోగ్యశ్రీ పథకం శ్రీసత్యసాయి జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ ఎం. శ్రీదేవి పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు అనారోగ్యానికి గురైతే కార్పొరేట్ల ఆస్పత్రులలో లక్షల రూపాయల ఖరీదు చేసే వైద్యం పొందాలంటే కష్టం అవుతుంది. చాలామంది తమకున్న ఆస్తులను సైతం అమ్మి ఖర్చు పెట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. లక్షలాదిరూపాయలు ఖర్చుపెట్టిన మనిషి కోలుకొని ఆరోగ్యంతో తిరిగి ఇంటికి వచ్చేవరకు నమ్మకాలు ఉండవు. పూర్వం తరం వాళ్ల పౌష్టిక ఆహారం తీసుకోవడం శారీరక శ్రమ చేయడం వల్ల అప్పట్లో రోగాలు దరిచేరేవి కావు. రాగి, సజ్జ, జొన్న, గోధుమ వంటి వాటితో పాటు పొలాల్లోనే దొరికే ఆకుకూరలు లాంటి పౌష్టిక ఆహారం తీసుకోవడంతో వల్ల ఆతరం వారు ఆరోగ్యంగా ఉండేవారు. అయితే మారిన కాల పరిస్థితుల వల్ల కలుషితమైన నీరు, గాలి, ప్రతీది కల్తీ వల్ల ఆహార అలవాట్లు మారిపోయాయి. ప్రతి మనిషికి ఆరోగ్యం ఎంతో అవసరం. ప్రతి రోగానికి అనేక రకాల పరీక్షలు చేయడం, సర్జరీలు, ఆపరేషన్లు తదితర వాటికి ఆ ఆసుపత్రి బిల్లు లక్షల రూపాయల్లో అవుతోంది. అంత మొత్తం భరించలేని పేద మధ్య తరగతి వారు నలిగిపోతుంటారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పథకం ప్రవేశ పెట్టడం వల్ల కాస్త ఉపశమనం కలుగుతోంది. ఈ పథకం ఏ విధంగా వినియోగించుకోవచ్చు ఎలా సహాయం పొందవచ్చు అన్న వివరాలు ఆరోగ్యశ్రీ పథకం జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ ఎం. శ్రీదేవి ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వివరించారు.

ప్రశ్న : ఆరోగ్యశ్రీ బాధితులు ఎవరికి దరఖాస్తులు చేసుకోవాలి.? ఈ స్కీము కు ఎవరు అర్హులు?

జవాబు : గతంలో ఈ పథకానికి డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ అని పేరు ఉండేది. ప్రస్తుతం డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవగా మార్చబడింది. ఈ పథకంలో చికిత్సలు పొందడానికి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ హెల్త్ కార్డ్ పేరు ఉన్న ప్రతి ఒక్కరూ అర్హులే. ఇందుకోసం తమ హెల్త్ కార్డును తీసుకుని వచ్చి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ గుర్తింపు పొందిన ప్రభుత్వ. ప్రైవేటు ఆసుపత్రులలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ కౌంటర్లలో ఉన్న వైద్య మిత్రలతో సంప్రదించి హెల్త్ కార్డును రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా పథకంలో ఉన్న ప్రయోజనాలను పొందవచ్చు. గతంలో ఉన్న డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు కూడా ఈ పథకం కిందికి వస్తుంది కాబట్టి దానిని ఉపయోగించుకోవచ్చు.

ప్ర : ఆరోగ్యశ్రీకి దరఖాస్తు చేసుకునే విధానం నిబంధనలు ఏమిటి.? ఎంత మొత్తం వరకు వినియోగించుకోవచ్చు.?

జ : డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకం ప్రయోజనాలను పొందవచ్చు. ప్రభుత్వం జారీ చేసిన ఆధార్ కార్డులో రోగి పేరు ఉండాలి. ఆ పేరు హెల్త్ కార్డు లో కూడా సరిపోయే విధంగా ఉండాలని నిబంధన ఉంది. ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రతి కుటుంబం 25 లక్షల వరకు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు.

ప్ర : ఏయే ఆసుపత్రులలో అనుమతి ఉంటుంది.?

జ : సత్య సాయి జిల్లాలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ గుర్తింపు పొందినవి 51 ఆసుపత్రులు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలు 11 ఉన్నాయి. మిగిలిన ప్రైవేట్ ఆస్పత్రులు. వీటిలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా చికిత్సలు తీసుకోవడానికి అనుమతి ఉంది. ఇందులో జిల్లా ఆస్పత్రులు 3, ఏరియా ఆసుపత్రులు 7, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు 40, ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో చికిత్స పొందడానికి అవకాశం ఉంది.

ప్ర : ఏయే బిల్లులు సమర్పించవలసి ఉంటుంది.? ఎంతవరకు బిల్లులో పరిమితి ఉంటుంది.?

జ : డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో హెల్త్ కార్డు ద్వారా చికిత్సలు చేసుకునే రోగులు ఎటువంటి బిల్లులు సమర్పించవలసిన అవసరం లేదు. ఆయా ఆసుపత్రులలో ఆరోగ్య మిత్రలే ప్రభుత్వానికి తగిన నివేదికను పంపుతారు. తద్వారా ఆరోగ్య బీమా పొందవచ్చు. కానీ ప్రభుత్వ ఉద్యోగులు అయితే ఇతర రాష్ట్రాలలో చికిత్స చేయించుకున్న బిల్లులను ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ద్వారా రియంబర్స్‌మెంట్ కోసం ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం ఆసుపత్రులలో వారు ఖర్చుపెట్టిన బిల్లులను, సర్జరీ చేయించుకున్నప్పటి నుండి డిశ్చార్జ్ వరకు బిల్లులను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌లో బిల్లుకు పరిమితి ఏమీ లేదు. అలాగే పేద మధ్యతరగతి కి చెందిన ఆరోగ్యశ్రీ పథకం కార్డు ఉన్నవారు ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఏ ఆసుపత్రి, అలాగే గుర్తింపు పొందిన ఏ ప్రయివేటు ఆసుపత్రి అయినా చికిత్స పొందవచ్చు.

ప్ర : ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు.? ఎంత మొత్తం ప్రభుత్వం నుంచి మంజూరు అయింది.?

జ: ఈ ఏడాది సుమారుగా ఇప్పటివరకు 11,686 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఆరోగ్య శ్రీ బీమా అందించడం జరిగింది. ఇందుకు రూ. 20.43 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.



ఆరోగ్యశ్రీ పథకం శ్రీసత్యసాయి జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ ఎం. శ్రీదేవి

ప్ర : జిల్లాలో మీ కార్యాలయం ఉందా.? సిబ్బంది కొరత ఉందా.?

జ : ప్రస్తుతం జిల్లా కేంద్రం అయిన పుట్టపర్తిలో కార్యాలయం లేదు. జిల్లాలోని హిందూపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో కార్యాలయం ఉంది. మా చిరునామా డాక్టర్ ఎం. శ్రీదేవి జిల్లా సమన్వయ అధికారి వారి కార్యాలయం కొత్త ఎం సి హెచ్ బిల్డింగ్ జిల్లా ఆసుపత్రి హిందూపురం. సెల్ నెంబర్ 9281068500. మరిన్ని వివరాలకు ఫోన్ చేసి సంప్రదించవచ్చు అన్నారు. జిల్లాలో 12 మంది వైద్య మిత్రల సిబ్బంది కొరత ఉంది. వీటిపై ప్రభుత్వానికి నివేదికలు పంపాము. ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

ముమ్మరంగా పోతురాజుకాలువ-సోదనపల్లి బ్రిడ్జి పనులు

ఎమ్మెల్యే చొరవతో రూ.4.50కోట్ల నిధులు మంజూరు - హర్షం వ్యక్తం చేస్తున్న పరిసర గ్రామాల ప్రజలు


హిటాచీతో పనులు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని పోతురాజుకాలువ, సోదనపల్లి మధ్యలో ఉన్న వంకపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చొరవతో బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.4.50కోట్లు మంజూరు చేసింది. దీంతో పనులు చకచకా సాగుతున్నాయి. మండల కేంద్రం సమీపంలోని శింగనమల చెరువు మరువ పారితే ఈ వంక ఉధృతంగా ప్రవహిస్తుంది. నాలుగేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు శింగనమల చెరువు మరువ ఉధృతంగా పారింది. ఫలితంగా మండల పరిధిలోని పోతురాజుకాలువ, సోదనపల్లి మధ్యలో ఉన్న వంకపై వేసిన మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు నెలల తరబడి రాకపోకలు సాగనీయలేదు. రాకపోకలు నిలిచిపోవడంతో పోతురాజుకాలువ గ్రామం నుంచి సోదనపల్లి గ్రామంలో ఉన్న పాఠశాల వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనికితోడు పోతురాజుకాలువ నుంచి సమీప గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. నీటి ప్రవాహం కొద్దిగా తగ్గినా ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని విద్యార్థులు పాఠశాలకు వెళ్లారు. అప్పటి ప్రతిపక్ష నాయకురాలిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ స్వయంగా పోతురాజుకాలువకు చేరుకుని తెగిన వంకను పరిశీలించారు. అప్పట్లో విద్యార్థులు పడుతున్న కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రత్యేక చొరవ తీసుకుని పోతురాజుకాలువ, సోదనపల్లి మధ్యలో ఉన్న వంకపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.50కోట్లను మంజూరు చేయించారు. నిధుల మంజూరుతోఆపటు బ్రిడ్జి పనులు సైతం శరవేగంగా సాగుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హర్షణీయం



ఎమ్మెల్యే చొరవతో పోతురాజుకాలువ, సోదనపల్లి మధ్యలో ఉన్న వంకపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం సంతోషకరం. బ్రిడ్జి లేకపోవడం వల్ల వర్షాకాలంలో విద్యార్థులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. అంతేగాకుండా పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. బ్రిడ్జి నిర్మాణంతో ఆయా సమస్యలకు పరిష్కారం లభించినట్లయింది.

అట్టే రామాంజనేయులు, సోదనపల్లి

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



పోతురాజుకాలువ, సోదనపల్లి మధ్యలో ఉన్న వంకపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీకి కృతజ్ఞతలు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్వయానా వంక వద్దకు వచ్చి సమస్యలు చూసిన శ్రావణిశ్రీ అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేయడం సంతోషకరం.

ఏకిల ఆదినారాయణ, సోదనపల్లి


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-పుట్లూరు

ఇటీవల గార్లదిన్నె మండలంలో జరిగిన బస్సు-ఆటో ప్రమాదంలో మరణించిన పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం అనంతపురంలోని స్వగృహంలో పరామర్శించారు. ఈ సందర్భంగా వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం నుంచి అందించే సాయంలో ఎక్కడా రాజకీయ కోణం చూడకుండా అందజేస్తామన్నారు. అయితే కొందరు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, వారి మాటలను నమ్మొద్దన్నారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని మంత్రి కేశవ్ ఇచ్చిన హామీ మేరకు బాధిత కుటుంబ సభ్యుల్లో అర్హతలు ఉన్న వారి బయోడేటా, విద్యార్హతలను పరిశీలించారు.

22న 'అంబికా' ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

అంబికా ఫౌండేషన్, అమరరాజా నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22వతేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎంపి అంబికా లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, అన్ని ట్రేడ్స్ పాస్/ ఫెయిల్ అర్హత కలిగిన అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకునే వారు సెల్.. 90000 24919, 90004 33990 నెంబర్లును సంప్రదించాలని కోరారు.

టిడిపి సభ్యత్వ నమోదుకు సహకారం

అనంతపురం రూరల్ : టిడిపి సభ్యత్వ నమోదు కోసం వాల్మీకి ఫెడరేషన్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పిఎల్‌ఎన్ మూర్తి రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఈమేరకు ఆదివారం నగరంలోని అర్బన్ టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర నాయకుడు గంగారామ్‌కు 46వ డివిజన్ నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా పిఎల్‌ఎన్ మూర్తిని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభినందించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-నార్పల

రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో రెండవ విడతలో భాగంగా మండల కేంద్రం సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పనకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపిడిఒ గంగాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 16వతేదీలోపు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోని స్కిల్ హబ్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ 90100 39901, 93475 65078 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ముళ్లపొదలు తొలగింపు

ప్రజాశక్తి-శింగనమల

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చొరవతో మండల పరిధిలోని చిన్నజలాపురంలో రోడ్డుకు ఇరువైలా ఉన్న పిచ్చిమొక్కలను టిడిపి నాయకులు ఆదివారం జెసిబి ద్వారా తొలగించారు. అలాగే డ్రెయినేజీలను శభ్రం చేయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వెంకటరాముడు, టిడిపి నాయకులు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

తెలుగు యువత నాయకులు కిరణ్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురికి బిపి, షుగర్, వంటి దగ్గు, జలుబు గుండెజబ్బులు, థైరాయిడ్, మొదలగు వంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

టిడిపి నేత మృతికి సంతాపం

గుత్తి : పట్టణానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు లడ్డు చంద్రశేఖర్ మరణించారు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా అధ్యక్షులు జి.వెంకట శివుడు యాదవ్, పలువరు నాయకులు చంద్రశేఖర్ ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకుడు కరిడికొండ సుధాకర్ నాయుడు, నాయకులు సి.లక్ష్మణ్, శ్రీశైలం, ధన ఆచారి, కరీం, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2006-07లో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈసందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. తర్వాత తమకు విద్యను అందించిన పాఠశాల, గురువులను ఎప్పటికీ మరువరాదన్నారు. పాఠశాలలో చేసిన అల్లరి, చిలిపి పనులను పూర్వ విద్యార్థులు జ్ఞాపకం చేసుకుని ఆనందించారు. అనంతరం విద్యను అందించిన గురువులను ఘనంగా సత్కరించి సన్మానించారు.

వికలాంగులకు చేయూత

ప్రజాశక్తి-అనంతపురం


విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న ఎఎస్పీ శ్రీనివాసులు

అమ్మ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని హెచ్చెల్సీ కాలనీలో ఉన్న అనాథ వికలాంగుల ఆశ్రమంలో 50 మంది విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా అమ్మసంస్థ వ్యవస్థాపకులు తరిమెల రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరికీ ఎలాంటి సహాయ, సహకారాలు అయినా అందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, అనంతపురం వికలాంగుల హోం ఇన్‌ఛార్జి ఇంద్రారాణి, తదితరులు పాల్గొన్నారు.

సైకిళ్లపై శబరిమలకు తరలిన భక్తులు

యాడికి : అయ్యప్ప స్వామి భక్తులు ఆదివారం మండల కేంద్రం నుంచి శబరిమలకు సైకిళ్లపై బయలుదేరారు. దాదాపు వెయ్యి కిలోమీటర్లకు పైగా ఉన్న శబరిమలకు యాడికి నుంచి సైకిల్ యాత్రగా బయలుదేరడం గమనార్హం. దాదాపు 15 రోజుల్లో స్వామివారి సన్నిధికి చేరుకునే అవకాశం ఉందని భక్తులు తెలిపారు.

ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న బద్దేనాయక్

కళ్యాణదుర్గం రూరల్ : బ్రహ్మసముద్రం మండలం పిల్లలపల్లి గ్రామానికి చెందిన బోయ మల్లీశ్వరి కుటుంబానికి ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ ఆదివారం రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. మల్లేశ్వరి భర్త బోయ రమేష్ నాలుగు నెలల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. ఈనేపథ్యంలో ఐదుగురు సంతానంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మల్లీశ్వరి కుటుంబ పరిస్థితులను గమనించి ఆర్థికసాయం చేసినట్లు బద్దేనాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి హరీష్, సభ్యులు తిప్పేస్వామి, ఉపాధ్యాయులు అశోక్, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

1104 యూనియన్ కార్యదర్శికి సన్మానం


నాగేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న వాకర్లు

ప్రజాశక్తి-గుత్తి

ఎపి రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల (1104) డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్రప్రసాద్‌ను గుత్తి మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానం చేశారు. నాగేంద్రప్రసాద్ వరుసగా మూడవసారి యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. దీంతో స్థానిక పట్టణంలోని ఎంఎస్ జూనియర్ కళాశాల వద్ద నాగేంద్రప్రసాద్‌ను శాలువా పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కన్వీనర్ డి.శివశంకర్ మాట్లాడుతూ నాగేంద్రప్రసాద్ విద్యుత్ ఉద్యోగులు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు చేయాలని సూచించారు. అంతేగాకుండా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు హెచ్ఎం డేనియల్, ఎఎస్ఐ శ్రీనివాసులు, రవికుమార్, న్యాయవాది విజయభాస్కర్, శివకుమార్, సలీం, శ్రీధర్‌గౌడ్, రవిచంద్ర, ఖాజాబాషా, శ్రీనివాసులు, సత్యనారాయణ, ఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆకుల రఘురామయ్యకు సన్మానం


రఘురామయ్యను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-నార్పల

రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో అనంతపురంలోని ఎస్ఎస్‌బిఎన్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన రాయలసీమ మహాకవి సమ్మేళనంలో తానా కవితా పురస్కార గ్రహీత ఆకుల రఘురామయ్యను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ కవులు, కళాకారులు, మేధావులు, పుర ప్రజలు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని బి.పప్పూరు గురుకుల పాఠశాల, కళాశాలలో జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు ఆధ్వర్యంలో ఆదివారం దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముందుగా విద్యార్థుల ఆరోగ్య స్థితిపై ఉపాధ్యాయులు, స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లల తరగతి గదులు, నివాస వవతి గృహ గదులను పరిశీలించారు. అనంతరం దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగుల హాజరు, సిబ్బంది హాజరు పట్టికలు, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ పర్యవేక్షకులు నూర్‌బాషా, శ్రీరాములు, ఉపాధ్యాయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, పాల్గొన్నారు.


హాస్టల్‌లోని గృహాలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి ఓబులు, తదితరులు

ఘనంగా నీలకంఠేశ్వరస్వామి రథోత్సవం

ప్రజాశక్తి-డి.హీరేహాల్



మండల కేంద్రంలో వెలసిన నీలకంఠేశ్వర స్వామి రథోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి రథోత్సవం నిర్వహించారు. జిల్లాతోపాటు కర్ణాటక నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రథోత్సవంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

మండల కేంద్రంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు వైసిపి నాయకులు ఆదివారం దుస్తులను పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం డిసెంబర్‌లో పున్నమి రోజు నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ప్రతిఏడు పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తూ వస్తున్నట్లు సర్పంచి లక్ష్మీదేవి, వైస్ సర్పంచు కరిడి మల్లికార్జున తెలిపారు. ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు రహంతుల్లా, సింగాడి మంజునాథ, హనుమంతురెడ్డి, శివారెడ్డి, గవిసిద్ధ, తదితరులు పాల్గొన్నారు

ప్రశాంతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు


నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు

ప్రజాశక్తి-యల్లనూరు

మండలంలోని 4 డబ్ల్యూఎలకు శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని నాలుగు డబ్ల్యూఎల్లో యల్లనూరు 8 టిసిలు, కల్లూరు 12 టిసిలు, తిరుమలాపురం 12 టిసిలు, వేములపల్లి 12 టిసి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా యల్లనూరులోని 1, 3, 4, 10 టిసిలకు ఎన్నికలు జరగలేదని తహశీల్దార్ రాజా తెలిపారు. యల్లనూరు సాగునీటి సంఘం అధ్యక్షులుగా పి.ఆదిశేషులనాయుడు, ఉపాధ్యక్షులుగా పి.శ్రీనివాసులరెడ్డి, కల్లూరు అధ్యక్షులుగా ఎం.వెంకటనాయుడు, ఉపాధ్యక్షులుగా ఎన్.రాజశేఖరరెడ్డి, వేములపల్లి అధ్యక్షులుగా జి.సదాశివారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎల్.రామాంజులు, తిరుమలాపురం అధ్యక్షులుగా కె. ప్రమీల, ఉపాధ్యక్షులుగా కె.నారాయణస్వామి ఎన్నికయ్యారు.

అంకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నార్పల : మండలంలోని బొందలవాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన అంకాలమ్మ ఆలయంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా మూడు రోజుల నుంచి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా వేద పండితులు శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్టాపన చేశారు. తర్వాత ధ్వజస్తంభ ప్రతిష్టగావించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచి అలం శిరీషా, ఉపసర్పంచి అలం వెంకట నరసానాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సామాన్యులకు అందుబాటులో డబుల్ బెడ్ రూం ఇళ్లు

బెల్ ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్లు రమేష్, శేఖర్

ప్రజాశక్తి-అనంతపురం


ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేస్తున్న బెల్ ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్లు

సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉన్న ధరలకు డబల్ బెడ్ రూం, ట్రిపుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మించనున్నట్లు బెల్ ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్లు రాకెట్ల రమేష్, ఎండి చంద్రశేఖర్ తెలిపారు. ఈమేరకు నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో బెల్ ఇన్‌ఫ్రా అధ్వర్యంలో డబల్ బెడ్‌రూం, ట్రిపుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు, ఇతర లబ్దిదారులకు నాణ్యతతో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. నూతన టెక్నాలజీతో అత్యద్భుతంగా అహుడా, ఇతర అన్ని రకాల ప్రభుత్వ అనుమతులతో ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వ్యాపారులు, సామాన్య, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'అమరజీవి' త్యాగం మరువలేనిది

వర్ధంతి సభలో జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం


అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు, సిబ్బంది

తెలుగువారి ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేసిన ధీరుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు కొనియాడారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలో పరిపాలన భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి వేరు చేసి తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాలని ఆయన సాగించిన మహత్తర పోరాటం మరువలేనిది అన్నారు. తెలుగువారి ప్రతిష్ట కోసం ప్రాణత్యాగం చేసి అమరుడయ్యారని గుర్తు చేశారు. ఆయన పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, యూనివర్శిటీ డైరెక్టర్లు పిఆర్.భానుమూర్తి, పి.సుజాత, ఒటిపిఆర్ఐ డైరెక్టర్ జివి.సుబ్బారెడ్డి, ఎపి శివకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, ఉపకులపతి పిఎ, ఎఆర్ నూర్‌మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం రూరల్ : అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ ప్రధాన సమావేశ మందిరంలో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రజలు గర్వంగా చెప్పుకునేలా ప్రత్యేక రాష్ట్ర సాధనకు పొట్టి శ్రీరాములు చేసిన 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష మరువలేనిదన్నారు. అదేవిధంగా ధృఢ సంకల్పం, సమైఖ్యత భావంతో దేశాన్ని ఏకఖండంగా ఉండాలని కాంక్షించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ చిరస్మరణీయులన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి : ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్, అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతులను పురస్కరించుకుని ఆదివారం ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో స్థానిక పెన్షనర్ల భవనంలో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం తాలూకా అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయిబాబు, కార్యదర్శి కె.రామ్మోహన్,కోశాధికారి ఫక్రుద్దీన్, నాయకులు నారాయణరెడ్డి, చెన్నారెడ్డి, నారాయణశెట్టి, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మాకం శ్రీకాంత్, కార్యదర్శి కె.కిషోర్ బాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కోశాధికారి నాగ సుదర్శన్, నాయకులు సాయి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ ఇబి.దేవి, ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ సుజాత, కార్యాలయ పరిపాలన అధికారి గిరిజ మనోహర్‌రావు, కార్యాలయ సిబ్బంది విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, సురేష్, మల్లికార్జున, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి అమరజీవి పొట్టి శ్రీరాములు

ఎస్‌కె ఛారిటబుల్ ఆధ్వర్యంలో..

సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కుందుర్పి మండలవ్యాప్తంగా నిర్వస్తున్న విలువల బడుల్లో పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు ఎస్‌కె లెనిన్‌బాబు, ప్రభుత్వ ఉపాధ్యాయులు రేవన్న, గురుస్వామి, విలువల బడి కోఆర్డినేటర్లు రఘువీరా, దిలీప్, శ్రీకాంత్, విలువల బడి ఉపాధ్యాయులు అనిత, నాగరాజు, లీలావతి, శ్రీలత, సౌమ్య,చాందిని, మంజు, హనుమంతురాయుడు, తమ్మయ్యదొడ్డి గ్రామ పెద్దలు రమేష్, చంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

యాడికి : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన పోరాటం, త్యాగం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్, ఆర్యవైశ్యులు పవన్‌కుమార్, రాజు, విశ్వనాథ్, రవ్వ పుల్లయ్య, ప్రదీప్, రవి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఆదివారం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు జయంతి సురేష్‌కుమార్, ఆడిటర్ జయంతి జయప్రకాష్ గుప్తా మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం వల్లే భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయన్నారు. అనంతరం ఆడిటర్ జయప్రకాష్ గుప్తాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, మహిళా మండలి, వాసవీ సేవాసమితి, ఆవోపా, వాసవీ వినాయక సేవా సమితి, ప్రతినిధులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని బుగ్గ-తలారి చెరువు గ్రామాల మధ్య గాలిమరలు, సోలార్ ప్లాంట్ దగ్గర ఉన్న పవర్‌స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తలారి చెరువు వీఆర్వోతో ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.

ప్రమాదంలో ఐచర్ క్లీనర్ మృతి


మృతిచెందిన రమేష్‌బాబు

బెలుగుప్ప : మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామ సమీపంలో గొర్రెల ఎరువు బస్తాలను ఐచర్‌లోకి లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి క్లీనర్ బాబు అలియాస్ రమేష్‌బాబు (24) మృతిచెందాడు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మడకశిర మండలం ఆముదాల గొంది పంచాయతీ ఇ.రామగిరి గ్రామానికి చెందిన బాబు అలియాస్ రమేష్‌బాబు అదే గ్రామానికి చెందిన నాగభూషణ కర్ణాటక రాష్ట్రం దొడ్డ బాలపూర్ తాలూకా ముక్కడిగట్టు గ్రామానికి చెందిన డ్రైవర్ ఆనంద్ కుమార్‌తో కలిసి దినసరి కూలిగా వెళ్లేవాడు. ఇందులో భాగంగానే కర్నూలు జిల్లా పత్తికొండ టౌన్ చుట్టుపక్కల గ్రామాల్లో గొర్రెల ఎరువు తీసుకుని వస్తుండగా బెలుగుప్ప మండలం దుద్దేగుంట గ్రామ సమీపంలోకి రాగానే అర్ధరాత్రి ఎరువుల బస్తాలకు కట్టిన తాళ్లు లూజు అయ్యాయి. దీంతో లారీ డ్రైవర్ ఆనంద్‌కుమార్ వాహనాన్ని నిలబెట్టి తాళ్లను సరిచేయాలని క్లీనర్ రమేష్‌బాబును ఐచర్ వాహనంపైకి ఎక్కించాడు. ఈసమయంలో వాహనం ముందుకు వెళ్లడంతో రమేష్‌బాబు ప్రమాదవశాత్తు కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని తండ్రి ఈశ్వరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.